క్లుప్తంగా

ఈదురుగాలులకు విరిగిపడిన స్తంభాలు



మోటుపల్లిలో నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్

చినగంజాం: మండలంలో శనివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు వర్షంతో కూడిన ఈదురు గాలులు వీచాయి. మండలంలోని పలు ప్రాంతాల్లో స్తంభాలు విరిగిపోగా ఒక మోటుపల్లి పంచాయతీలో 10 స్తంభాలు నేలకొరిగాయి. దీం పాటు విద్యుత్ తీగలు కూడా తెగిపడ్డాయి. 11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. విద్యుత్ శాఖకు నష్టం వాటిల్లినట్లు విద్యుత్ శాఖ ఏఈ పీ ఘన నారాయణ తెలిపారు.

పర్చూరులో చల్లబడిన వాతావరణం



పర్చూరులో రాత్రి కురుస్తున్న వర్షం

పర్చూరు (చినగంజాం): పర్చూరులో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వేడిగాలులతో ప్రజలను అల్లాడించిన ఎండ శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి కొంత చల్లబడింది. వేడిమిని తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు వర్షం రాకతో కొంత ఊరట చెందారు. మండలంలోని అన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. ఆకాశమంతా మబ్బులు కమ్మి వాతావరణం చల్లగా మారటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కన్నుల పండువగా స్వామివారి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల–అద్దంకి రోడ్డులో కొలువైఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివార్లకు శనివారం కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. దంపతులు హాజరై భూనీలా సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని కనులారా వీక్షించారు. కల్యాణ వేడుకల అనంతరం కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

ప్రభుత్వ బడుల్లోనే బంగారు భవిష్యత్



క్యాంపెయిన్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

స్వర్ణ (కారంచేడు): మీ బిడ్డల బంగారు భవిష్యత్ కోసం మీ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గ్రామంలో మెయిన్ రోడ్డు, కొత్తూరు, ఉత్తరబజారు, వైసీ కాలనీలలో క్యాంపెయిన్ నిర్వహించారు. శనివారం మండలంలోని స్వర్ణ గ్రామంలో ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు తమ పాఠశాలలో అందిస్తున్న విద్య, సంక్షేమ పథకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. హైస్కూల్ హెచ్‌ఎం ఎంవీ సుబ్బారావు, ఉపాధ్యాయ బృందం 6వ తరగతిలో చేరే విద్యార్థుల జాబితాను తీసుకొని వారి గృహాలకు వెళ్లి మన ఊరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే ఎందుకు చేర్పించాలనే విషయమై తల్లిదండ్రులతో మాట్లాడారు. కార్యక్రమంలో భవానీప్రసాద్, మల్లేశ్వరరావు, సుధాకర్, భాస్కర్, ప్రకాశరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంకొల్లులో నేత్రదానం



వెంకటరత్నం (ఫైల్)

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు గ్రామానికి చెందిన కరి వెంకటరత్నం (75) శనివారం మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులు మృతురాలి నేత్రాలను దానం చేసేందుకు ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీకి సమాచారం అందించారు. కమిటీ సభ్యులు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శేఖర్‌తో దాత కార్నియాలను సేకరించారు. దాత కుమారులు వెంకటేశ్వర్లు, సుధాకర్, కోడళ్లు మాధురి, ఉదయలక్ష్మి, కుమార్తె రాధారాణి, అల్లుడు శ్రీనివాసరావులకు రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు ఎస్ రామ్మోహనరావు, జే స్వామి, రోటరీ అధ్యక్ష, కార్యదర్శి, ట్రెజరర్‌లు భవనం అందిరెడ్డి, కరి కమలేశ్వరరావు, వంకాయలపాటి శ్రీమన్నారాయణలు ధన్యవాదాలు తెలియజేశారు.

సేవాలయాలు

- వార్డు ప్రజలకు మరింత చేరువలో సేవలు
- వలంటీర్లతో గడప వద్దకే పథకాలు
- 500 సేవలు అందుబాటులో
- కష్టపడి పనిచేస్తున్న ఉద్యోగులు, వలంటీర్లు

చీరాల అర్బన్:

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంచలనం సృష్టించింది. ప్రజా సంకల్పయాత్రలో మాటిచ్చిన విధంగా నవరత్నాల పథకాలతో పాటు చెప్పని హామీలు కూడా నెరవేరుస్తూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. ఒకప్పుడు ప్రభుత్వ పథకాలు అందుకోవాలంటే సామాన్యుడికి అందని ద్రాక్షగా ఉండేది. సిఫారసు ఉంటేనో, మధ్యవర్తుల ప్రమేయం ద్వారా డబ్బులు ముట్టచెబితేనో అందుకునే దుస్థితి. పనులు మానుకొని కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే రోజులకు స్వస్తి పలికింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనను సాకారం చేస్తూ సీఎం వైఎస్ జగన్ గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ సేవలు ప్రజల దరికి చేర్చడంలో సచివాలయ వ్యవస్థ ప్రధాన భూమిక పోషిస్తోంది. ఈ వ్యవస్థలో వలంటీర్లు అతి ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. ఏ వార్డులో ప్రజలు ఆ వార్డులో ఏర్పాటు చేసిన సచివాలయంలో ప్రభుత్వ సేవలను అందుకునేలా చర్యలు తీసుకోవడంతో ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. చీరాల మున్సిపాలిటీలో మొత్తం 33 వార్డులుండగా వీటికి 25 సచివాలయాలను ఏర్పాటు చేశారు. ప్రతి సచివాలయంలో పది మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రతి వార్డు సచివాలయ పరిధిలో ఆ వార్డు జనాభా ప్రాతిపదికన ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దాదాపు 35 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 500 సేవలు అందుబాటులో ఉన్నాయి. దేశ చరిత్రలో ఒకేసారి 1.34 లక్షల సచివాలయ ఉద్యోగాలు ఇచ్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

చీరాల మున్సిపాలిటీలో మొత్తం సచివాలయాలు : 25
సచివాలయాల సిబ్బంది: 190
వలంటీర్ల సంఖ్య : 375
పట్టణంలో పింఛన్ల లబ్ధిదారుల సంఖ్య : 8155
పింఛన్లు అందుతున్న లబ్ధి : రూ. 2.26 కోట్లు



పాపరాజుతోట వార్డు సచివాలయం

ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలు...

సచివాలయాల్లో ప్రధానంగా ఇంటి పట్టా, రైస్ కార్డు, మ్యుటేషన్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పోలీస్ వెరిఫికేషన్, నో ఎర్నింగ్ సర్టిఫికెట్, వన్–బీ, అడంగల్, పింఛన్ దరఖాస్తు, సదరం, ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డు, కరెంటు, ఆర్‌టీఏ తదితర సేవలు ఎక్కువగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డు, పింఛన్ కావాలంటే జన్మభూమి కమిటీలు అనుమతితో ఇచ్చేవారు. దరఖాస్తు చేస్తే ఎప్పటికో కార్డులు మంజూరు అయ్యేవి. ఈ కార్డులకు కూడా పల్స్ సర్వేకు ముడిపెట్టి అప్పట్లో కోతలు పెట్టేవారు. నేడు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకుంటే అర్హత ఆధారంగా 90 రోజుల్లో ఇంటి స్థలం మంజూరు చేస్తున్నారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే వలంటీర్ ద్వారా ఏడు రోజుల్లో ఇంటికి తెచ్చిస్తున్నారు.

సచివాలయ ఉద్యోగంతో నెరవేరిన ఆకాంక్ష..



కింది ఫోటోలో ఉన్న యువకుడి పేరు తన్నీరు శివనాగేశ్వరరావు. పాపరాజుతోట సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఎంఏ, బీఈడీ పూర్తి చేశాడు. ఉద్యోగం కోసం గతంలో ఎన్నో ప్రయత్నాలు చేశాడు. కానీ గత ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్‌లు ఇవ్వకపోవడంతో నిరాశ చెందాడు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో దరఖాస్తు చేశాడు. తన ప్రతిభతో సచివాలయ ఉద్యోగం సాధించాడు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిరుద్యోగులకు ఒక భరోసా కల్పించి సచివాలయాల్లో ఉద్యోగం కల్పించారు. ఆయన ఇచ్చిన భరోసాతోనే ఉద్యోగం సంపాదించాను. సచివాలయ ఉద్యోగిగా పనిచేయడం వలన కుటుంబాన్ని పోషించుకుంటూ సంతోషంగా ఉన్నానని చెప్పాడు.

నెరవేరిన సొంతింటి కల..



ఈఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు బీ పూర్ణప్రసాద్. చీరాల పట్టణంలోని 25వ వార్డు. గత 20 ఏళ్లుగా చీరాలలోనే నివాసముంటున్నారు. అద్దె ఇంట్లోనే ఉంటూ చిరువ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే సొంతింటి స్థలం కోసం గతంలో అర్జీలు అందించినా ప్రయోజనం లేదు. సచివాలయంలో ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. సచివాలయ సిబ్బంది విచారణ చేసి అర్హుడిగా నిర్ణయించి ఇంటి స్థలం మంజూరు చేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఇంటి స్థలం కోసం ఎదురుచూస్తున్న తనకు స్థలం మంజూరు అవడంతో ఆనందం వ్యక్తం చేశాడు.

సచివాలయాల ద్వారా ఎన్నో సేవలు..

ఈ ఫొటోలో కనిపిస్తున్న దంపతుల పేర్లు ఎస్.వెంకట సుబ్బారావు, ప్రభావతి. వీరికి సంతానం లేదు. చీరాల పాపరాజుతోటలో నివాసముంటున్న వీరిలో ప్రభావతి వృద్ధాప్య పింఛన్ తీసుకుంటున్నారు. అయితే భర్త వెంకట సుబ్బారావుకు కళ్లు సక్రమంగా కనిపించవు. దివ్యాంగ పెన్షన్ కోసం, సదరం సర్టిఫికెట్ కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ప్రభుత్వ వైద్యశాలలో స్లాట్ రావడంతో వైద్యులు పరీక్షించి సదరం సర్టిఫికెట్ మంజూరు చేశారు. సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే సచివాలయ సిబ్బంది స్పందించి పెన్షన్ రావడానికి కృషి చేశారు. సచివాలయ సేవలు అభినందనీయమని భావోద్వేగంతో చెప్పారు.



సదరం సర్టిఫికెట్ అందుకున్న దంపతులు

వైఎస్సార్ యంత్రసేవా రైతులకు మేలు



యంత్రసేవా పథకాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కృష్ణచైతన్య

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: సీఎం జగన్ మోహన్‌రెడ్డి అందజేస్తున్న వైఎస్సార్ యంత్రసేవా పథకాన్ని రైతులు వినియోగించుకోవాలని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య పేర్కొన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ గ్రూపులకు రాయితీపై ట్రాక్టర్లు, ట్రాక్టర్ సామగ్రి, వరికోత యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.3.5 కోట్ల విలువ చేసే వరికోత యంత్రాలను, ట్రాక్టర్‌ను 40 శాతం సబ్సిడీపై రైతులకు అందజేశారు. జిల్లా మొత్తంలో 5 వరికోత యంత్రాలు మంజూరు కాగా నియోజకవర్గానికి రెండు మంజూరు చేశారన్నారు. అనంతరం వరికోత యంత్రాలను, ట్రాక్టర్‌లను నడిపి ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ ధన్‌రాజ్, అద్దంకి, సంతమాగులూరు, కొరిశపాడు ఏవోలు వెంకటకృష్ణ, లావణ్య, శ్రీనివాసరావులు, అద్దంకి మండల పార్టీ కన్వీనర్ జ్యోతి హనుమంతురావు, అద్దంకి మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మేష్, సర్పంచ్‌లు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా నాగార్పమ్మవారి కొలుపులు



కొలుపుల్లో పాల్గొన్న భక్తులు

బల్లికురవ: మండలంలోని సోమవరప్పాడు గ్రామంలో కొండవర్దువారి ఇలవేల్పు నాగార్పమ్మ కొలుపులు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను అమరావతి సముద్రస్నానాకి తీసుకెళ్లారు. గురు, శుక్ర, శనివారాల్లో మాతుడుపు, పుట్ట బంగారం, బొల్లావులు, వీరతాళ్లతో గ్రామోత్సతం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల పక్కనే ఉన్న నాగార్పమ్మ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, జిల్లాలోని కొండవర్దు కుటుంబ సభ్యులంతా కొలుపులకు రావడంతో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది. ఆదివారంతో కొలుపులు ముగించి రాత్రికి అన్నదానం చేస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు.

హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నదే

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

సంతమాగులూరు (అద్దంకి రూరల్): నాలుగేళ్ల పాలనలో ఇచ్చిన హామీలన్నీ నేరవేర్చిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని పాతమాగులూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం 3వరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి అందుతున్న సంక్షేమ పథకాల గురించి తెలుసుకున్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి సంక్షేమ పథకాలు అందించలేదన్నారు. సొంతిళ్లు లేనివారు ఎవరు ఉండకూడదని, లక్షల మంది పేదలకు స్థలాలు మంజూరు చేశారన్నారు. జగనన్నకు ప్రజల్లో విశేషమైన ఆదరణ లభిస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో జగనన్నకు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్, జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, కార్పొరేషన్ డైరెక్టర్, సొసైటీ అధ్యక్షుడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

వైభవంగా ఆలయంలో బొడ్డురాయి ప్రతిష్ట



పూజలు నిర్వహిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి



బొడ్డురాయి ప్రతిష్టలో పాల్గొన్న రామనాథంబాబు

మార్టూరు: మండలంలోని నాగరాజుపల్లి గ్రామంలో శనివారం బొడ్డురాయి, ఆలయ ప్రతిష్టా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. నాగరాజుపల్లి తండాలో పోలేరమ్మతల్లి దేవాలయంతో పాటు బొడ్డు రాయి ప్రతిష్టా కార్యక్రమం నిర్వహించగా పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్, వైఎస్సార్ సీపీ నాయకుడు రావి రామనాథంబాబులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తండా నాయకులు ఇరువురుకి స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఆమంచి తండాలో పర్యటించి తండా వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ నరేంద్రబాబు, తండా నాయకులు శ్రీను నాయక్, పరసా నాయక్, గోవింద నాయక్, ఎర్రకోట నాయక్, స్థానిక మండల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రేపు అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

చినగంజాం: మండలంలోని రాజుబంగారుపాలెం పంచాయతీ కుక్కలవారిపాలెం గ్రామంలో 12వ తేదీ సోమవారం ఉదయం 7.28 గంటలకు అభయాంజనేయస్వామి ప్రతిష్ట నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం పూజా కార్యక్రమాలతో కార్యక్రమాలను ప్రారంభించారు. 11వ తేదీ ఆదివారం పూజ, 12న విగ్రహ ప్రతిష్ట, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమాలు శ్రీమాన్ పరాశం భోగ శ్రీనివాస మారుతి వరప్రసాద్ భట్టాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైద్యశిబిరాల ఏర్పాటు అభినందనీయం



అద్దంకిలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యుడు



కొమ్మినేనివారిపాలెంలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

బల్లికురవ/అద్దంకి: ప్రభుత్వం వైద్య వసతిలేని గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యంతో అవసరమైన వారికి ఉచితం శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు ఒంగోలు కిమ్స్ వైద్యాధికారి బీ. రామాంజనేయులు తెలిపారు. శనివారం మండలంలోని కొమ్మినేనివారిపాలెంలో ఉచిత వైద్యశిబిరంలో భాగంగా 270 మందికి షుగరు, బీపీ, ఈసీజీ కంటిపరీక్షలు చేశారు. 30 మందికి కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసి ఒంగోలు రావాల్సిందిగా కోరారు. శిబిరంలో సమన్వయ కర్త పీ.రామాంజనేయులు, వీఆర్వో కాలేషా వలి, ఎఎన్‌ఎం అరుణ, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో..

రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో హైదరాబాద్‌కు చెందిన ఏపీఐఎస్ వైద్యశాల వైద్యులు కాళ్లకు సంబంధించిన వ్యాధులకు ఉచితంగా 59 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో రాఘవరావు, రోటరీ ప్రెసిడెంట్ సందిరెడ్డి శ్రీనివాసరావు, చిన్న మురళీకృష్ణ, తమ్మన శ్రీనివాసరావు సుధాకర్‌రెడ్డి, డాక్టర్ పవన్ పాల్గొన్నారు.

నూతన చర్చి నిర్మాణానికి శంకుస్థాపన

జే.పంగులూరు: మండల పరిధిలోని తూర్పు తక్కెళ్లపాడు గ్రామంలో శనివారం నూతన చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ శాప్ నెట్ చైర్మన్, అద్దంకి నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణ చైతన్య, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బాచిన చెంచు గరటయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాయిణి వెంకట సుబ్బారావు, గ్రామ నాయకులు నాగేశ్వరావు, అకేంద్ర, గ్రామస్తులు, పాస్టర్లు పాల్గొన్నారు. అనంతరం వారు తూర్పు కొప్పెరపాడు గ్రామంలో శనివారం ప్రసన్నాజనేయ స్వామి ఆలయ 3వ వార్షికోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. ఆయన వెంట కార్యక్రమంలో పెంట్యాల సుబ్బారావు, ఎనికపాటి రవి, బి రమేష్, పూజారి హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న కృష్ణచైతన్య, గరటయ్య

చిరువ్యాపారులకు అండగా జగనన్నతోడు



బ్యాంకు సిబ్బందికి అందిస్తున్న ఏపీఎం సుబ్బారావు

చీరాల టౌన్: వీధి వ్యాపారులు, చిరు వ్యాపారులకు వడ్డీ వ్యాపారుల నుంచి విముక్తులను చేసి అండగా నిలిచేందుకు జగనన్న తోడు పథకాన్ని అమలు చేస్తున్నారని వైఎస్సార్ కేపీ ఏపీఎం సుబ్బారావు అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న బ్యాంకు సిబ్బందిని కలిసి జగనన్నతోడు పథకానికి సంబంధించిన దరఖాస్తులు అందించారు. చీరాల మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 613 మందికి ఈపథకంలో ఒక్కొక్కరికి రూ.10 వేలు అందిస్తున్నారని తెలిపారు. పథక సాయం కావాల్సినవారు విధిగా గ్రామ సంఘాలను సంప్రదించాలని ఏపీఎం సూచించారు. కార్యక్రమంలో పలు బ్యాంకుల సిబ్బంది, సీసీ సుబ్బారావు, వీఓఏలు ఉన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహకం అందజేత



నగదు ప్రోత్సాహకం అందిస్తున్న సంఘ సభ్యులు

వేటపాలెం: పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో ఇంటర్ మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి ప్రోత్సాహక బహుమతిగా రూ.5 వేలు నగదు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ మండలం పరిధిలోని దేశాయిపేటకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన సజ్జా జితేంద్ర వెంకట్ ఇంటర్ ఎంపీసీ గ్రూపులో 458 మార్కులు సాధించాడని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సుంకర వెంకట లక్ష్మీప్రసాదు, కార్యదర్శి ప్రసాద్, చుండూరు మురళీకృష్ణ, నాగాంజనేయులు, రావి మస్తాన్‌రెడ్డి, రుసుం ప్రియాంక, వీరాంజనేయులు, పూల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా అశోక్‌వర్ధన్



అశోక్‌వర్ధన్

వేటపాలెం: మండల తహసీల్దార్‌గా అశోక్‌వర్ధన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన సంతమాగులూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనికోసం కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆయన సిబ్బందికి సూచించారు.

ముగిసిన రోటరీ క్లబ్ మజ్జిగ చలివేంద్రం



మజ్జిగ పంపిణీలో పాల్గొన్న రోటరీ ప్రతినిధులు

పర్చూరు (చినగంజాం): పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిరంతరాయంగా సాగిన మజ్జిగ పంపిణీ చలివేంద్రం శనివారం ముగిసింది. రోటరీ ట్రస్ట్ అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు నేతృత్వంలో గత ఏప్రిల్‌లో మజ్జిగ పంపిణీ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో 41 రోజుల పాటు ప్రతి రోజు 600 మందికి చల్లటి మజ్జిగను పంపిణీ చేశారు. వేసవిలో ప్రయాణికులు, పాదచారులు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు రోటరీ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు తెలిపారు. చివరి రోజు శనివారం మజ్జిగతో పాటు స్వీట్లను కూడా ప్రజలకు అందించినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమానికి సహకరించిన దాతలకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈవో డీ నాగేశ్వరరావు, రోటరీ సభ్యులు పీ సదానందరెడ్డి, మంగళగిరి కోటేశ్వరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.